సాక్షి చిత్తూరు

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



ఏనుగుల బీభత్సం

పెద్దపంజాణి మండలంలోని పెద్దకాప్పల్లిలో మామిడి తోటలపై ఏనుగుల గుంపు దాడి చేసి తీవ్ర నష్టం కలిగించాయి. - IIలో



సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 5న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. - IIలో



పోటాపోటీగా ఆడుదాం ఆంధ్రా

జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు చిత్తూరులోని మెసానికల్ మైదానంలో హోరాహోరీగా సాగుతున్నాయి. - IIలో

న్యూస్‌రీల్

మొదటి రోజు 81.9 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీని గురువారం వలంటీర్లు పటిష్టంగా చేపట్టారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,74,469 మంది పింఛన్‌దారులకు రూ.80.55 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో తెల్లవారుజామున నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ మొత్తాలను నేరుగా అందించారు. అనారోగ్యంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు కూడా వలంటీర్లు నేరుగా పింఛను మొత్తం అందజేశారు. గురువారం సాయంత్రానికి మొత్తం 81.9 శాతం మేరకు పింఛన్ల పంపిణీని పూర్తి చేశారు. మరో రెండు రోజుల్లో పంపిణీని వందశాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు.

డీఈఓ, పీఓలకు సత్కారం



డీఈఓ, పీఓలను సత్కరిస్తున్న ఎంఈఓలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో విద్యాశాఖకు సంబంధించి తయారుచేసిన విద్యాశాఖ శకటం ద్వితీయ బహుమతిని సాధించింది. అలాగే సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక బాలాజీ కాలనీలో నిర్వహించిన ఎంఈఓ సమావేశంలో డీఈఓ విజయేంద్రరావుకు, ఏపీసీ వెంకటరమణారెడ్డికి ఎంఈఓలు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు అరుణాచలరెడ్డి, సెల్వరాజ్, త్యాగరాజరెడ్డి, మోహన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ జాతీయ పోటీలకు కొటాల విద్యార్థి



జశ్వంత్

యాదమరి: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 ఖోఖో పోటీలకు కొటాల ఉన్నత పాఠశాలకు చెందిన జశ్వంత్ ఎంపికై నట్లు గురువారం పాఠశాల హెచ్ఎం యూసఫ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో నిర్వహిస్తున్న అండర్-14 ఖోఖో పోటీల్లో తమ విద్యార్థి ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జశ్వంత్‌ను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, పీఈటీ సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.


పకడ్బందీగా ఉద్యోగుల వివరాల సేకరణ



వివరాలు సేకరిస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల విధులకు సంబంధించి ఉద్యోగుల వివరాల సేకరణ నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నారు. డీఆర్‌ఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్నిశాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఆ వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సేకరిస్తున్న ఉద్యోగుల వివరాల ఆధారంగా త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు విధులకు కేటాయించనున్నారు.

రహదారి భద్రతతో సురక్షిత ప్రయాణం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీసీ నిరంజన్ రెడ్డి

చిత్తూరు రూరల్: రహదారి భద్రతతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని డీటీసీ నిరంజన్ రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా చిత్తూరులో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణా కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా గిరింపేట, ఎంఎస్ ఆర్ కూడలి, గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం డీటీసీ నిరంజన్ రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ రఘువీర్‌విష్ణు మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. మద్యం మత్తులో పరిమితికి మించి ప్రయాణికులతో వాహనం నడపరాదన్నారు. వాహనదారులు చట్టాలలోని నిబంధలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నిత్యాబాబు, ఆర్టీఓ సునీల్ ఎంవీఐలు రాజేశ్వర రావు, వాసుదేవరెడ్డి, దీపిక, భాగ్యశ్రీ, ప్రసాద్ వర్మ, మురళీ, శివకుమార్ పాల్గొన్నారు.

ఎల్లో తాత.. ఏంటీ రోత

అధినేత నాన్చుడు ధోరణి.. సోషియల్ మీడియాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రోజుకో వార్త.. అభ్యర్థుల ప్రకటనలో దోబూచులాట.. గంటకో లీక్.. కొన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత లేమి.. ఎల్లో మీడియాలో అసత్య కథనాలు..వెరసి టీడీపీ నేతలు, శ్రేణుల్లో గుబులు పుడుతోంది. ఫలితంగా వారు అధినేతా ఏమిటీ గందరగోళం.. ఎందుకీ మూడు ముక్కలాట.. అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీ నేతల్లో గుబులు

- పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలపై రోజుకో వార్త
- సొంత పార్టీ నేతలే అభ్యర్థుల ఖరారంటూ లీకులు
- అధినేతకు ఫోన్లు చేసి అడుగుతున్నా తమ్ముళ్లకు రాని క్లారిటీ
- ఆ సీట్లు తమకే కేటాయించారంటూ జనసేన శ్రేణులు ప్రచారం
- నాన్చుడు ధోరణిపై మండిపడుతున్న టీడీపీ శ్రేణులు

సాక్షి, తిరుపతి : అధినేత చంద్రబాబు తీరుతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీడీపీ శ్రేణులు తీవ్ర గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. అటు ప్రకటించిన అభ్యర్థులు.. ప్రకటించని స్థానాలపై నమ్మకంతో ఉన్న నాయకులు సైతం రోజుకో వార్త విని టెన్షన్‌తో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అభ్యర్థుల కొరతను కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబు తన ఎల్లో సోషల్ మీడియా ద్వారా లీకులు ఇస్తూ పార్టీ నాయకులను గందరగోళానికి గురిచేస్తున్నారని తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులు వెతికినా దొరకడం కరువైంది. ఈ పరిస్థితుల్లో టీడీపీ–జనసేనకు సత్యవేడు, గూడూరు ఎమ్మెల్యే ఆదిమూలం, వరప్రసాద్ ఆపద్బాంధవుల్లా కనిపించారు. వారిద్దరిని బూచిగా చూపించి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి క్యూకడుతున్నారంటూ తన ఎల్లో మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నారు. ఆ ఇద్దరిని ఓ సారి ఎంపీ అభ్యర్థులని, మరోసారి అసెంబ్లీ అభ్యర్థులని లీకులు చేస్తున్నారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు అధినేతపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు చేయిస్తున్న లీకులతో ఆయా స్థానాలను నమ్ముకుని ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ గురించి ఆలోచన చేయకపోవడంపై వారి వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా వారి పేర్లను ప్రకటించకుండా దాగుడు మూతలెందుకని ప్రశ్నిస్తున్నారు.

యాదవులు గుడ్‌బై

రాష్ట్రంలోనే కీలకమైన తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిత్వంపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అభ్యర్థిని ఖరారు చేయకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి అసెంబ్లీ స్థానం జనసేన వారికి అని, మరోసారి టీడీపీకే అని ఇలా రోజుకొక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిస్తున్నారు. దీంతో ఓ వైపు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మరో వైపు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్ తనకే తనకే అని ఊహల్లో ఉన్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల టీడీపీ చేపట్టిన సర్వే జాబితాలో యాదవులకు చెందిన ఏ ఒక్కరి పేరు లేకపోవడంపై ఆ సామాజిక వర్గం నేతలు భగ్గుమంటున్నారు. అభ్యర్థిగా ప్రకటించకపోయినా పర్వాలేదు.. సర్వే జాబితాలో కూడా తమ సామాజిక వర్గం వారికి చోటు లేదా? అంటూ మండిపడుతున్నారు. యాదవులను టీడీపీ కేవలం ఓటు బ్యాంకింగ్ వాడుకుంటుందే తప్ప వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు ఈ 40 ఏళ్ల కాలంలో తమను ఎందుకు గుర్తించలేదని నిలదీస్తున్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకింగ్ చూసే టీడీపీకి సహకరించాల్సిన అవసరం లేదని తీర్మానం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

బాబు మూడు ముక్కలాట

చిత్తూరు, చంద్రగిరి, పూతలపట్టు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి స్థానాలకు ఇటు టీడీపీ, అటు జనసేన శ్రేణుల మధ్య తగవుపెట్టి వేడుక చూస్తున్నారని ఆపార్టీ శ్రేణులు అధినేత తీరుపై భగ్గుమంటున్నారు. పూతలపట్టు ఇదివరకే అభ్యర్థిని ప్రకటించినా.. తన సామాజిక వర్గం నేతల ఒత్తిడికి బాబు తలొగ్గినట్టు సమాచారం. అందులో భాగంగానే అభ్యర్థిని మార్చే విషయంపై ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చిత్తూరు, శ్రీకాళహస్తి టికెట్ ఓసారి జనసేనకే అని, మరో సారి టీడీపీకే అని లీకులు చేయిస్తున్నారు. తాజాగా శ్రీకాళహస్తి ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి కేటాయిస్తున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం చేయించారు. దీంతో ఆ స్థానాలను నమ్ముకుని ఉన్న అభ్యర్థులు అధినేత తీరుతో తలలు పట్టుకుంటున్నారు. మరో వైపు ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన సామాజిక వర్గం వారందరినీ చంద్రబాబుకు వద్దకు తీసుకెళ్లి బొజ్జల సుధీర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. బొజ్జల సుధీర్‌కి ఇస్తే తాము ఎవరూ సహకరించమని తేల్చిచెప్పినట్లు సమాచారం. అలాగే చంద్రగిరి అభ్యర్థి విషయంలోనూ చంద్రబాబు పునరాలోచనలో పడిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి తన బంధువులను లేదా ప్రముఖ పారిశ్రామిక వేత్తను రంగంలోకి దింపాలనే యోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వెంకటగిరి విషయానికి వస్తే స్థానిక ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మస్తాన్‌యాదవ్‌కి ఒకరికి తెలియకుండా ఒకరితో చంద్రబాబు మాట్లాడినట్లు తెలిసింది. వెంకటగిరి టికెట్ నీకే, నీకే, నీకే అని ముగ్గురికి హామీ ఇచ్చినట్లు వెంకటగిరిలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. సూళ్లూరుపేట విషయానికి వస్తే తను అనుకున్న వారికి టికెట్ ఇచ్చేందుకు ప్రస్తుత ఆశావహుల మధ్య వివాదాలు సృష్టించినట్లు విశ్వసనీయ సమాచారం. చంద్రబాబు ప్రతి ఎన్నికల్లోనూ ఇదే తరహా రాజకీయాలు చేయడం షరామామూలై పోయిందని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా

కుప్పంరూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ ఫలా లు పేదలు, బడుగులకు అందాలంటే మళ్లీ జగనన్ననే గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా అన్నారు. గురువారం మండల పరిధిలోని చెక్కునత్తం, నడుమూరు, వసనాడు పంచాయతీల్లో ×జగనన్నతో జనం, భరత్ అన్నతో మనం॰ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాల్లోన్ని మహిళలకు పసుపు, కుంకుమ, చీర ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు తెచ్చి బడుగులు, బలహీన వర్గాల బతుకుల్లో వెలుగులు తెచ్చారన్నారు. ప్రస్తుతం అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకేంద్రంలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గత నెల 24వ తేదీ నుంచి జరుగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ మేరకు పరీక్షల సిటీ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు చెప్పారు. పరీక్షలను ప్రశాంతవాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు. చివరి రోజు గురువారం నిర్వహించిన పరీక్షకు ఉదయం 128 మందికిగాను 124 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 256 మందికి 248 మంది హాజరైనట్లు వెల్లడించారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ఆర్‌కే రోజా

- దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి పట్టాలు
- లబ్ధిదారులకు ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : రాష్ట్రంలో పేదల పాలిట నిలబడిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయం వద్ద నగరి రూరల్ మండలం మీరా సాహెబ్ పాలెం, ఎంఎన్ కండ్రిగలో 65 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను, పొజిషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని, అప్పుడే మంచి పనులు చిరకాలం పాటు కొనసాగుతాయన్నారు. మీరాసాహెబ్‌పాలెంలో కొత్తగా ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న 34 మందికి శ్రీనివాసపురం లేఅవుట్‌లో, జగనన్న కాలనీలో ఇంటి స్థలాలను కేటాయిస్తూ పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎంఎన్ కండ్రిగలో అర్హులైన 31 మందికి తమ నివాస స్థలాల స్వాధీన పత్రాలను (పొజిషన్ సర్టిఫికెట్లు) పంపిణీ చేశామన్నారు. ఇంతలా ఏ ప్రభుత్వమూ పేద ప్రజల గురించి ఆలోచించలేదని తెలిపారు. ఇల్లు లేని పేదలకు శాశ్వతమైన ఒక నివాసాన్ని ఏర్పరచి ఇవ్వడంతో పాటు వారికి పత్రాలు కూడా అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ నందిని, ఎంపీటీసీలు ఇమ్రాన్‌ఖాన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం

- పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజ
- వేసవిలో నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు
- జిల్లాలో 2420 అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా 57 వేల మంది గర్భిణులకు పౌష్టికాహారం
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పక్కన సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ ఆధ్వర్యంలో 2–6 స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్, పరిశ్రమలు, పంచాయతీరాజ్, వ్యవసాయ మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పథకాల గురించి సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం వేగంగా జరుగుతోందన్నారు. ప్రతి నెల 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు పథకాలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే పింఛన్ల పంపిణీలో జిల్లా ముందంజలో ఉందన్నారు. కరువు నివారణకు ఉపాధి హామీ పనులను కల్పించడంలో డ్వామా అధికారుల కృషి మరువలేనిదన్నారు. జిల్లాలో రోజు దాదాపు 50 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ట్యాంకులను శుభ్రం చేసి, మంచినీటి పైపులైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి మందుల పంపిణీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నీటి వృథాతో పాటు కలుపు నివారణ కోసం డ్రిప్ విధానం చేపట్టడం జరిగిందని తెలిపారు. రబీ సీజన్‌లో పంటలు వేగంగా విస్తరిస్తున్నాయని పట్టు పరిశ్రమ శాఖలో జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. ఆర్బీకేల ద్వారా త్వరలో క్రిమిసంహారక మందులు నానో ఎరువులు కూడా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మత్స్య సంపాదన పెంపొందించడానికి మరిన్ని పథకాలు రావడం జరిగిందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య తెలిపారు. ఆర్థిక అసమానత్వాన్ని పోగొట్టడానికి పలు పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాలోకి నగదు జమ అయ్యేలా ప్రభుత్వం అన్ని విధాలుగా చేస్తోందన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులకు సంబంధించి ప్రభుత్వం అందించే నాణ్యమైన ఆహారాన్ని క్షేత్రస్థాయిలో సకాలంలో అందించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ చైర్మన్ భారతి అన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలో 2420 అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా 57 వేల మందికి పౌష్టికాహారం అందించడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

భాను.. పక్కనే స్మగ్లర్

- గంజాయి స్మగ్లర్‌ను పక్కనే పెట్టుకొని ప్రసంగాలు
- ఇదేనా గాలిమాటలంటే అంటూ నవ్వుకుంటున్న జనం



గంజాయి స్మగ్లింగ్‌పై మాట్లాడుతున్న నగరి టీడీపీ ఇన్‌చార్జ్ భానుప్రకాష్, పక్కనే గంజాయి స్మగ్లర్ హరికృష్ణ

నగరి: పుత్తూరు పట్టణంలో గంజాయి విక్రయాలు పెరిగాయంటూ టీడీపీ నేత గాలిభానుప్రకాష్ ప్రసంగాలు ఇవ్వడం, ఆ సమయంలో రెండు సార్లు గంజాయి కేసులో అరెస్టు అయిన ఆ పార్టీ నేత హరికృష్ణ పక్కనే ఉండడం హాస్యాస్పదమైంది. గురువారం పుత్తూరు పట్టణంలో పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న భానుప్రకాష్ ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుత్తూరు పట్టణంలో గంజాయి విక్రయాలు ఎక్కువయ్యాయని, ఇంజినీరింగ్ కళాశాలలు, ఇతర కళాశాలల్లో విద్యార్థులకు గంజాయిని విచ్చల విడిగా అందిస్తున్నారని ఊకదంపుడు ప్రసంగం ఇచ్చేశారు. ప్రసంగం ఇస్తున్నంతసేపు గంజాయి కేసులో రెండు సార్లు అరెస్ట్ అయిన హరికృష్ణ ఆయన పక్కనే ఉండడం చూసి జనం విస్తుపోయారు. హరికృష్ణే కదా గత ఏడాది గంజాయి తరలిస్తూ విజయనగరం జిల్లా శృంగవరపు కోట వద్ద 28 కేకిలోల గంజాయితో పట్టుబడి అరెస్టు అయింది, అతనే కదా పుత్తూరు పట్టణంలోని స్వర్ణా హౌసింగ్ కాలనీలో గంజాయి తరలిస్తూ పట్టుబడింది అంటూ చర్చించుకున్నారు. ఉట్టిమీద పెట్టుకొని ఊరంతా తిరిగినట్లు అన్న సామెత మాదిరిగా గంజాయి స్మగ్లర్‌ను పక్కనే పెట్టుకొని ఈ ప్రసంగాలేంటి సారు అంటూ ముక్కున వేలేసుకున్నారు.

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో డీఎస్పీల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దీర్ఘకాలికంగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాయుడుపేటలో పనిచేస్తున్న రాజగోపాల్‌రెడ్డి చిత్తూరు డీఎస్పీగా, ఇక్కడ పనిచేస్తున్న వి.శ్రీనివాసరావు రాజమహేంద్రవరానికి, భీమవరంలో పనిచేస్తున్న బి.శ్రీనాథ్ కుప్పం డీఎస్పీగా, కర్నూలు దిశ డీఎస్పీ ఐ.సుధాకర్‌రెడ్డి చిత్తూరు దిశ డీఎస్పీగా, ఇక్కడ పనిచేస్తున్న బాబూ రాజేంద్రప్రసాద్‌ను కర్నూలు దిశకు బదిలీ అయ్యారు. నంద్యాలలో పనిచేస్తున్న సి.మహేశ్వరరెడ్డి పలమనేరుకు, ఇక్కడ పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి ఆళ్లగడ్డకు, చిత్తూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ వి.శ్రీనివాసరెడ్డి నాయుడుపేటకు, నగరిలో పనిచేస్తున్న కె.రవికుమార్ వైఎస్సార్ కడప జిల్లా పోలీసు శిక్షణా కేంద్రానికి, చిత్తూరు ఏఆర్ డీఎస్పీ మురళీధర్‌ను వైఎస్సార్ కడపకు పంపించారు. అలాగే అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న మహబూబ్‌బాషను చిత్తూరు ఏఆర్ డీఎస్పీగా బదిలీ చేశారు. గుంటూరు, కర్నూలు రేంజ్‌లో పనిచేస్తున్న పలువురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ వారికి పోస్టింగులు ఇచ్చారు. డీఎస్పీలుగా పదోన్నతి పొంది బదిలీ అయిన వారిలో కె.శ్రీనివాసచారి తిరుమలకు, ఎస్‌డీ తేజశ్వరరావు చిత్తూరు స్పెషల్‌బ్రాంచ్‌కు, కె.నరసింహమూర్తి నగరికి బది లీ అయ్యారు. అలాగే తాడేపల్లిగూడెంలో పనిచేస్తు న్న శరత్‌రాజ్‌కుమార్ చంద్రగిరికి, గుంటూరు వెస్ట్‌లో ఉన్న బి.ఉమామహేశ్వర్‌రెడ్డి శ్రీకాళహస్తికి, తిరుమలలో పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి తిరుపతి స్పెషల్‌బ్రాంచ్‌కు, తిరుపతి ఎర్రచందనం నిరోధక విభాగంలో ఉన్న డి.మురళీధర్ ప్రొద్దుటూరు, తిరుపతిలో ఉన్న వి.గిరిధర్ ఏసీబీకి, చంద్రగిరిలో ఉన్న యశ్వంత్ జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. అలాగే తిరుపతి ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ ఒంగోలుకు, వైఎస్సార్ కడపలో ఉన్న రమణయ్య తిరు పతికి బదిలీ చేసినట్లు ఉత్తర్వులు వెల్లువడ్డాయి.

ఎంపీడీఓలతో సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కడప, నెల్లూరు జిల్లాల నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీపై వచ్చిన 32 మంది ఎంపీడీఓలు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. జిల్లాలో అన్ని సంక్షేమ పథకాలను అర్హులకు అందించి రాష్ట్రస్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి ఎంపీడీఓలు కృషి చేయాలని చైర్మన్, సీఈఓలు వివరించారు.

క్లుప్తంగా

చైర్మన్, ఈఓపై విచారణ

చిత్తూరు రూరల్ : నగరంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్, ఈఓపై సదరు ఆలయంలో పనిచేస్తున్న ఒప్పంద మహిళా ఉద్యోగిని గీత చేసిన ఫిర్యాదుపై గురువారం విచారణ జరిగింది. వేతనం సక్రమంగా ఇవ్వకుండా, విధులకు రానీయకపోవడంపై సదరు ఉద్యోగిని రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని జిల్లా దేవదాయ శాఖ అధికారి ఏకాంబరంను రాష్ట్ర అధికారులు ఆదేశించారు. దీంతో పాలకవర్గ చైర్మన్ ఎత్తిరాజులు, ఈఓ తిమ్మారెడ్డి, అర్చకులు సుధాకర్ గురుక్కల్‌ను ఏసీ విచారించారు. తనను అమానవీయంగా మాట్లాడడంపై మహిళా ఉద్యోగిని విచారణ అధికారి ఎదుట బోరున విలపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, నివేదికను త్వరలోనే అందిస్తానని తెలిపారు.

పోటాపోటీగా ఆడుదాం ఆంధ్రా



కబడ్డీ సెమీస్‌లో తలపడుతున్న నగరి, పూతలపట్టు జట్లు



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

- రెండవరోజు హోరాహోరీగా సాగిన జిల్లాస్థాయి పోటీలు
- కబడ్డీలో నగరి జట్టు విజయం
- నేటితో ముగియనున్న పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి క్రీడాపోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో గురువారం జిల్లాస్థాయి కబడ్డీ, క్రికెట్, పీవీకేఎన్ మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పురుషుల కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. సెమీఫైనల్స్, ఫైనల్స్ కబడ్డీ పోటీల్లో జట్లు రసవత్తరంగా తలపడ్డాయి.

ఉత్కంఠగా సాగిన క్రికెట్ మ్యాచ్‌లు

మెసానికల్ మైదానంలో నిర్వహించిన పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి. క్రికెట్ మ్యాచ్ తొలి లీగ్‌లో పలమనేరు, కుప్పం జట్లు తలపడగా పలమనేరు గెలుపొందింది. మరో లీగ్‌లో పుంగనూరు, పూతలపట్టు తలపడగా పూతలపట్టు విజేతగా నిలిచింది. పలమనేరు, జీడీ నెల్లూరు జట్ల మధ్య జరిగిన సెమీస్‌లో జీడీ నెల్లూరు గెలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. శుక్రవారం సెమీస్‌లో చిత్తూరు, పూతలపట్టు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలుపొందే జట్టు ఫైనల్స్‌కు చేరుకుంటుంది. తృతీయ స్థానం కోసం పలమనేరు జట్టు సెమీస్‌లో ఓడిన జట్టుతో తలపడాల్సి ఉంటుంది. పలమనేరు, జీడీనెల్లూరు, పూతలపట్టు మహిళా జట్ల మధ్య తొలి మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి.

నువ్వా.. నేనా..!

కబడ్డీ పురుషుల విభాగంలో సెమీస్‌కు చేరుకున్న నగరి, పూతలపట్టు జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ఈ పోటీల్లో పూతలపట్టు క్రీడాకారులకు గాయాలు అయినప్పటికీ గెలుపుకోసం పోరాడారు. అదే జట్టుపై నగరి జట్టు 17/13 పాయింట్లతో విజయం సాధించింది. ఫైనల్స్ పోటీలు నగరి వర్సెస్ కుప్పం జట్ల మధ్య జరగాల్సి ఉంది. అయితే కుప్పం జట్టు పోటీల్లో పాల్గొనకపోవడంతో నగరి జట్టును విజేతగా ప్రకటించారు. ఈ పోటీల్లో నగరి జట్టు (మొదటి స్థానం), జీడీ నెల్లూరు (ద్వితీయస్థానం), పూతలపట్టు (తృతీయస్థానం)లో నిలిచాయి.

కబడ్డీ పోటీల్లో కవలల ప్రతిభ..

పురుషుల విభాగంలో సాగిన కబడ్డీ పోటీల్లో నగరి జట్టులో అనిల్‌కుమార్, సునీల్‌కుమార్ కవలలు ప్రతిభ చూపారు. నగరి జట్టు గెలుపునకు ఇద్దరి కవలల ఆట తీరు ఎంతో ఉపయోగపడింది. నగరి నియోజకవర్గం నింద్ర మండలం కొప్పేడు గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆ ఇద్దరు కవలలు చిన్నతనం నుంచి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న అనిల్‌కుమార్, పీజీ వరకు సునీల్‌కుమార్ చదివాడు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడాకారులు, క్రీడల అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో ప్రస్తుతం పాల్గొన్నట్లు వారిద్దరు సాక్షికి వెల్లడించారు.

నేటితో జిల్లాస్థాయి పోటీలు ముగింపు..

గత రెండు రోజులుగా సాగుతున్న జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు శుక్రవారంతో ముగియనున్నాయి. శుక్రవారం క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు పూర్తికాగానే అన్ని క్రీడలు పూర్తి అవుతాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ వెల్లడించారు. పోటీలు ముగియగానే జిల్లాస్థాయిలో గెలిచిన జట్లను ప్రకటించి రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలకు పంపనున్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి నగదు, ఆడుదాం ఆంధ్రా ట్రోఫీలను అందజేయనున్నారు.

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



రామకుప్పం మండలంలోని వర్దికుప్పం వద్ద కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, నాయకులు

వి.కోట: చిత్తూరు జిల్లాలో ఈనెల 5న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సీఎం పర్యటన ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 5న కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండలంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ ఉన్నారు.

సభాస్థలి పరిశీలన

రామకుప్పం(శాంతిపురం): కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలంలో సీఎం సభా స్థలిని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి గురువారం క్షేత్ర పరిశీలన చేశారు. వర్దికుప్పం వద్ద హంద్రీ–నీవా కుప్పం కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అక్కడ సీఎం సభకు అనువైన ప్రదేశం లేకపోవడంతో మిట్టపల్లి వద్ద కాలువ సమీపంలోని రామాలయ భూముల వద్ద సీఎం సభకు అనువుగా ఉన్నట్టు గుర్తించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, రెస్కో చైర్మన్ సెంథిల్, వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మండల కన్వీనర్లు బాబురెడ్డి, దండపాణి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ పాల్గొన్నారు.

సదరన్ సైన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న జెడ్పీ హైస్కూల్ గుత్తార్లపల్లి విద్యార్థిని మీనా

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్ నైపుణ్యాలను వెలికి తీసేందుకు విజయవాడలో నిర్వహించిన సదరన్ సైన్స్ పోటీల్లో చిత్తూరు జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారని జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలు గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు నిర్వహించారని చెప్పారు. ఈ పోటీల్లో పుదుచ్చేరి, తమిళనాడు, కర్ణాటక పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఏపీ తరఫున చిత్తూరు జిల్లాలోని గుడుపల్లి, పెద్దపంజాణి మండలాల నుంచి విద్యార్థులు, టీచర్స్ ప్రాజెక్టులను తీసుకెళ్లినట్లు చెప్పారు. టీచర్స్ విభాగంలో లలితాసుభాషిణి (జెడ్పీ, శెట్టిపల్లి, గుడుపల్లి మండలం) నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో మీనా (జెడ్పీ, గుత్తార్లపల్లి, గుడుపల్లి మండలం) నగదు బహుమతి, విద్యార్థుల గ్రూప్ విభాగంలో హేమామాధురి, పావని (పెద్దపంజాణి) మండలాలకు చెందిన విద్యార్థులు పుస్తక బహుమతులు అందుకున్నారని ఆయన వెల్లడించారు. వారిని డీఈఓ విజయేంద్రరావు అభినందించారు.

ఏనుగుల బీభత్సం

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. బుధవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లికి చెందిన రైతు రమణా రెడ్డి మామిడి తోటపై విరుచుకుపడ్డాయి. మామిడి చెట్లను విరిచేశాయి. వరి పంటను తొక్కి నాశనం చేశాయి. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు ఏనుగుల విధ్వంసాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పంటలపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సామాజిక మాధ్యమాల వినియోగంపై జాగ్రత్త



డీఎస్పీ పావన్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు సామాజిక మాధ్యమాల వినియోగం పట్ల కలిగే నష్టాలను తెలుసుకోవాలని శిక్షణా డీఎస్పీ పావన్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని నారాయణ పాఠశాలలో సైబర్ క్రైమ్ నియమాలు, మానవ అక్రమ రవాణా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ముఖ్యమన్నారు. బట్టీ చదువులకు స్వస్తి పలికి విషయాన్ని అర్థం చేసుకుని చదవాలన్నారు. సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. పరీక్షల సమయంలో సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే అనుకున్న మార్కులను సాధించలేరని చెప్పారు. వన్‌టౌన్ ఎస్‌ఐ భారతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలను వినియోగించేటప్పుడు తగు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు సైబర్ మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేదవతి, ఏజీఎం ఫణికుమార్ పాల్గొన్నారు.

కాపలాదారునిపై చిరుత దాడి



గాయపడిన రవిని పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి

సదుం/కల్లూరు(పులిచెర్ల): మామిడి తోటకు కాపలాగా ఉన్న ఓ వ్యక్తిపై చిరుత దాడి చేసింది. వివరాలు.. చిత్తూరు జిల్లా సోమల మండలం వినాయకపురం ఎస్టీ కాలనీకి చెందిన రవి తన కుటుంబ సభ్యులతో కలిసి పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలో అటవీ ప్రాంతంలో ఉన్న ఓ మామిడి తోటకు కాపలాదారుగా ఉన్నారు. గురువారం ఉదయం ఆవులు అరవడం, కుక్కలు మొరుగుతుండడంతో తోటలోకి వెళ్లి చూడగా హఠాత్తుగా చిరుతపులి దాడి చేసింది. అతని కేకలు విని కుటుంబ సభ్యులు రావడంతో పులి వెళ్లిపోయింది. గాయపడిని రవిని ప్రైవేటు వాహనంలో సదుం సీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రున్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పరామర్శించారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని డీఈఓ విజయేంద్రరావు వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలాజీ కాలనీలో ఉన్న మున్సిపల్ పాఠశాలలో ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ ప్రతి తరగతిలో ప్రతి విద్యార్థి అభ్యసనా నైపుణ్యాలను పెంపొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఎంఈఓలు నిత్యం పాఠశాలలను తప్పనిసరిగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. విధులకు సక్రమంగా రాని టీచర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి ఎంఈఓ తప్పనిసరిగా తనిఖీలు చేసిన రిపోర్టు ప్రతి నెలా డీఈఓ కార్యాలయానికి పంపాలన్నారు. సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మండల స్థాయిలో డిజిటల్ విద్య బలోపేతానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం బైజూస్ ట్యాబ్‌లను వినియోగించాలని చెప్పారు. ట్యాబ్‌ల వినియోగం పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రెండవ విడతలో పంపిణీ చేసిన ట్యాబ్‌లకు కొన్నింటికి త్వరలో ఎస్‌డీ కార్డులు వస్తాయన్నారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 16,800 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అనంతరం పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంఈఓలకు శిక్షణ ఇచ్చారు. సమీక్షలో సెక్టోరల్ అధికారులు అజయ్‌కుమార్‌రెడ్డి, జయప్రకాష్, ఉదయలక్ష్మి, పల్లవి, టీచ్ టూల్ కోఆర్డినేటర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

- ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్ షణ్మోహన్
- బాధ్యతలు స్వీకరించనున్న 37 మంది తహసీల్దార్లు

చిత్తూరు కలెక్టరేట్ : త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు నియమించిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ షణ్మోహన్ గురువారం తహసీల్దార్ల నియామకాల ఉత్తర్వులను జారీచేశారు. ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగ విరమణ పొందే తహసీల్దార్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. వారిని కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో సూపరింటెండెంట్లుగా నియమించారు. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన వారికి మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు 37 మందికి పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టింగ్‌లు ఇచ్చిన వారు వెంటనే నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మినహాయింపు ఇచ్చిన వారికి ఇలా..

కలెక్టరేట్ ఎల్‌ఏ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్ ఏఓగా నియమించారు. పెద్దపంజాణి మండలం తహసీల్దార్ లోకేశ్వరరావును గంగవరానికి, పలమనేరు ఆర్డీఓ కార్యాలయం డీఏఓ ప్రసాద్‌బాబును కలెక్టరేట్ ఏఓఎల్ఆర్ సెక్షన్‌కు, పలమనేరు తహసీల్దార్ కుప్పుస్వామిని పలమనేరు ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా, పూతలపట్టు తహసీల్దార్ విజయభాస్కర్‌ను చిత్తూరు ఆర్డీఓ ఆఫీస్ ఏఓగా, ఐరాల తహసీల్దార్ సుశీలను కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్‌కు, తవణంపల్లి తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డిని కలెక్టరేట్ మెజిస్ట్రీరియల్ సెక్షన్‌కు, విజయపురం తహసీల్దార్ వెంకటరాయలును కలెక్టరేట్ ఎల్‌ఏ సెక్షన్‌కు, సస్పెన్షన్‌లో ఉన్న షబ్బీర్‌బాషాకు కలెక్టరేట్ కేఆర్‌ఆర్‌సీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా కేటాయించారు. అలాగే బీఎన్ కండ్రిగ డీటీగా పనిచేస్తున్న శివయ్యకు ఉద్యోగోన్నతి కల్పించి వెదురుకుప్పం తహసీల్దార్‌గా మొత్తం10మందిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనంతపురం నుంచి వచ్చిన 14 మందికి..

విజయలక్ష్మి (గుడిపాల), హరికుమార్ (కుప్పం), వసంతలత (పులిచెర్ల), నాగరాజు (సోమల), నారాయణస్వామి (సదుం), నీలకంఠరెడ్డి (చౌడేపల్లి), రంగనాయకులు (పలమనేరు), నాగేంద్ర (పెద్దపంజాణి), సయ్యద్ షాబుద్దీన్ (గుడుపల్లి), సుబ్బలక్ష్మమ్మ (పాలసముద్రం), శ్రీధర్ (రామకుప్పం), స్వర్ణలత (బైరెడ్డిపల్లి), సురేష్‌కుమార్ (వి.కోట), మురళీకృష్ణ (శాంతిపురం) మొత్తం 14 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు.

వైఎస్సార్ కడప నుంచి వచ్చిన నలుగురికి..

శ్రీనివాసరెడ్డి (చిత్తూరు అర్బన్), చంద్రశేఖర్‌రెడ్డి (నగరి), సుబ్రహ్మణ్యంరెడ్డి (పుంగనూరు), దైవదీనం(యాదమరి)ను మండలాలకు కేటాయించారు.

కర్నూలు నుంచి వచ్చిన 13 మందికి..

నాగమణి (నింద్ర), హసీన్‌బీ (తవణంపల్లి), శ్రీనివాసులు (ఐరాల), ఆల్ఫ్రెడ్ (ఎస్‌ఆర్‌పురం), మల్లికార్జునరావు (విజయపురం), షేక్‌మోహిద్దీన్(రొంపిచెర్ల), సుభద్రమ్మ (బంగారుపాళ్యం), శివరాముడు (పూతలపట్టు), సుభద్ర(పెనుమూరు), పుష్పకుమారి(కార్వేటినగరం), వేణుగోపాలరావు(కుప్పం ఆర్డీఓ ఆఫీస్, డీఏఓ), రవి (జీడీ నెల్లూరు), చంద్రశేఖర్ (నగరి ఆర్డీఓ ఆఫీస్, డీఏఓ)మొత్తం 13 మందికి పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఘనంగా మినిస్టర్ వైట్ షోరూం ప్రారంభం



వస్త్ర షోరూంను ప్రారంభిస్తున్న మినిస్టర్ వైట్ గ్రూప్ అధినేత ఎస్.పోతురాజు దంపతులు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డు, అన్నమయ్య సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినిస్టర్ వైట్ వస్త్ర షోరూం గురువారం ఘనంగా ప్రారంభించారు. మినిస్టర్ వైట్ గ్రూప్ అధినేత ఎస్.పోతురాజు దంపతులు పూజ చేసి అనంతరం మినిస్టర్ వైట్ షోరూంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మినిస్టర్ వైట్ షోరూం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం చాలా సంతోషకరమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ఆకర్షణీయమైన పంచెలు, చొక్కాలు సరికొత్త డిజైన్లలో లభిస్తాయన్నారు. ఏడాది పిల్లల నుంచి 16 ఏళ్ల యువకుల వరకు అన్ని రకాల పంచలు, ధోవతీలు, కుర్తాలు, చొక్కాలు సరసమైన ధరల్లో లభిస్తాయని తెలిపారు. మినిస్టర్ వైట్ వస్త్ర షోరూం ప్రారంభం సందర్భంగా తిరుపతి క్లాత్ మర్చంట్ అండ్ రెడీమేడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రతినిధులు, వివిధ వస్త్ర వ్యాపారులు హాజరై మినిస్టర్ వైట్ గ్రూప్ అధినేత ఎస్.పోతురాజు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఊయలే ఊపిరి తీసిందా ?

- చిన్నారి మెడ చుట్టూ గాయాలు
- పోలీసుల విచారణలో నిగ్గు తేలనున్న నిజం



మృతి చెందిన కుమార్తెను చూసి రోదిస్తున్న తల్లి మాధవి

పలమనేరు: నిద్రపోతున్న తమ బిడ్డ ఊయలో నుంచి పడి మృతిచెందిందని తల్లిదండ్రులు రోదిస్తున్నారు. చిన్నారి మెడ చుట్టూ గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ స్థానిక వైద్యులు పోలీసులకు సమాచారం అందిచారు. అయితే చిన్నారి ఊపిరి తీసింది ఊయలేనా? లేక ఇంకేదైనా కారణాలా ? అనే విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. పలమనేరు పట్టణ సమీపంలోని సాయినగర్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. గంగవరం సమీపంలోని సాయినగర్‌లో హరికృష్ణ కుటుంబం కాపురం ఉంటోంది. ఇతని కుమార్తె దియాన్సి(2)ని భార్య మాధవి ఊయలో వేసి ఇంటిమిద్దెపై దుస్తులు ఉతుకుతుండగా ఈ ఘటన జరిగినట్టు హరికృష్ణ మరదలు హేమావతి చెబుతోంది. అపస్మారకస్థితిలో ఉన్న బాలికను పలమనేరు ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, ఆపై వెనుకనే తల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. చిన్నారిని పరిశీలించిన డాక్టర్ శారద అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. అయితే చిన్నారి మెడచుట్టూ గాయాలు కనిపించడంతో ఆమె స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అయితే పాప మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలనున్నాయి.